


ప్రారంభోత్సవానికి సిద్ధంగా వున్న పార్కు

ఫ్లై ఓవర్ కింద పచ్చదనం

నగరవాసులకు ఆహ్లాదం

● రూ.8.6 కోట్లతో కోయంబేడు వంతెన దిగువ ఎకో పార్కు

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో కోయంబేడు ఫ్లై ఓవర్ కింద ఖాళీ స్థలం అందమైన పార్కు మారింది. చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ (సీఎండీఏ) ఆధ్వర్యంలో కోయంబేడు ఫ్లైఓవర్ దిగువన సుమారు 4 ఎకరాల్లో నిర్మించిన ఎకో పార్కు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రూ.8.6 కోట్లతో నిర్మించిన ఈ పార్కులో చిన్నారులను ఆకట్టుకునే ఎన్నో అంశాలున్నాయి. చిన్న చిన్న వాటర్ ఫౌంటెయిన్లు, మినీ కొలనులు కూడా ఉన్నాయి. యోగా చేసేందుకు ప్రత్యేకమైన హాళ్లు , వాకింగ్ ట్రాక్ కూడా ఉంది. బైకులు, కార్లు, వ్యాన్లలో వచ్చేవారి కోసం పార్కింగ్ ఏరియా కూడా సిద్ధం చేస్తున్నారు. ఈ పార్కులో వలయాకారపు క్రీడా ప్రాంగణం నిర్మించారు. నగరవాసులు కూర్చుని క్రీడలను వీక్షించడానికి అర్ధచంద్రాకారంలో సిట్టింగ్ ఏరియా నిర్మించారు. అక్కడక్కడా చెట్లు నాటారు. చిన్నారుల ఆట సామగ్రి, అక్కడక్కడా కూర్చోవటానికి సిమెంట్, కొయ్య బల్లలు కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పార్కులో చివరి దశ అలంకరణ పనులు జరుగుతున్నాయి.

వేకువజామున భారీ వర్షం



లోతట్టు ప్రాంతాలు జలమయం

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం వేకువజామున కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి, రహదారుల్లో వర్షపునీరు వరదలా ప్రవహించింది. సెంట్రల్, ఎగ్మూరు, కోడంబాక్కం, కోయంబేడు, మధురవాయల్, థౌజెండ్ లైట్స్, వడపళని, చూళైమేడు, అంబత్తూరు తదితర ప్రాంతాలలో వేకువజాము 2 గంటలకు ప్రారంభమైన వర్షం 5 గంటల వరకు కురిసింది. పెనుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి నగరంలో పలు చోట్ల చెట్లు కూలిపడ్డాయి. షైలాపూరులో 80 మి.మీ., అయనావరంలో 70 మి.మీ., వెస్ట్ మాంబళం, పెరంబతూరు, తండయార్‌పేటలో 60 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

విమాన సేవలకు అంతరాయం..

వర్షాల కారణంగా మీనంబాక్కం విమానాశ్రయంలో 14 విమాన సేవలకు అంతరాయం ఏర్పడినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.ఖతార్ రాజధాని మస్కట్ నుండి 317 మంది ప్రయాణీలతో వేకువజాము 2.50 గంటలకు వచ్చిన విమానం వర్షం కారణంగా ల్యాండింగ్ కాలేకపోయింది. దీంతో చాలా సేపటివరకు ఆకాశంలోనే చక్కర్లు కొట్టింది. చివరకు ఆ విమానాన్ని బెంగళూరు మళ్లించారు. దుబాయ్, షార్జా, లండన్ విమానాలు కూడా నిర్ణీత సమయంలో ల్యాండింగ్ కాలేక అరగంట వరకూ ఆకాశంలోనే చక్కర్లు కొట్టాయి. ఆ తర్వాత ఆ విమానాలు ఒకదాని తర్వాత ఒకటి ల్యాండ్ అయ్యాయి. వర్షాల కారణంగా మారిషస్‌కు, థాయ్‌లాండ్, దుబాయ్, షార్జా, లండన్, అబుదాబీ, ఢిల్లీ, కొచ్చిన్ వెళ్లే విమానాలు ఆలస్యంగా బయలుదేరాయి. దీంతో ఆ విమానాల్లో వెళ్ళాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగిస్తున్న కార్మికులు


ఉపరాష్ట్రపతి సీపీ.రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ఉపరాష్ట్రపతితో ఈపీఎస్ భేటీ

● పలువురు బీజేపీ నేతలతోనూ సమావేశం

ప్యారీస్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అన్నాడీఎంకే అధినేత, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) మంగళవారం ఢిల్లీలో ఉపరాష్ట్రపతి సీపీ.రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ఈపీఎస్‌ను అన్నాడీఎంకే ఎంపీలు సీవీ షణ్ముగం, డాక్టర్ తంబిదురై, ఐఎస్.ఇన్బదురై ఘన స్వాగతం పలికారు. ఈపీఎస్‌తో పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు ఎస్పీ వేలుమణి, కేపీ మునుస్వామి కూడా హస్తినకు వెళ్లారు. వారితో కలిసి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఉపరాష్ట్రపతి సీపీ.రాధాకృష్ణన్‌ను కలిసిన ఈపీఎస్ ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఉపరాష్ట్రపతితో భేటీ అనంతరం ఈపీఎస్ రాత్రి 8 గంటల సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతోనూ సమావేశమయ్యారు. పార్టీలోని అసమ్మతులపైనా ఆయనతో కూలంకషంగా చర్చించినట్లు తెలిసింది.

విజయ్ పర్యటనలో మార్పు

● రోజుకు రెండు జిల్లాల్లో మాత్రమే ప్రచారం



ప్యారీస్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, నటుడు విజయ్ రోజుకు రెండు జిల్లాల్లో మాత్రమే ప్రచారం చేయనున్నారు. గతంలో విజయ్ పర్యటన కోసం తయారు చేసిన రూట్‌మ్యాప్‌లో స్వల్పమార్పులు చేపట్టినట్లు ఆ పార్టీ నిర్వాహకులు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 'ప్రజలతో భేటీ' అనే నినాదంతో ఈ నెల 13న తిరుచ్చిలో విజయ్ తన పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఆ రోజు తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు మూడు జిల్లాల్లో విజయ్ పర్యటిస్తారని పార్టీ ప్రకటించింది. అయితే తిరుచ్చి, అరియలూరు ప్రాంతాల్లో రద్దీ కారణంగా నిర్ణీతకాలం కంటే ప్రచారానికి ఎక్కువ సమయం పట్టింది. ఇందువల్ల పెరంబలూరు పర్యటన విజయ్ రద్దు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో 20వ తేదీ తిరువారూర్, నాగపట్నం జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని పార్టీ కార్యాలయం తెలిపింది.

నూతన పారిశ్రామికవాడల ప్రారంభం


వీసీ ద్వారా పారిశ్రామికవాడలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.67.34 కోట్లతో కొత్తగా ఏర్పాటైన నాలుగు ప్రభుత్వ పారిశ్రామికవాడలను, రెండు ప్రైవేటు పారిశ్రామిక వాడలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. చెన్నై సచివాలయంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ, రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటైన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీటిని ప్రారంభించారు. రూ.78.57 కోట్లతో నిర్మించనున్న కార్మికుల వసతిగృహం, వ్యవసాయ ఉత్పత్తుల మౌలిక సదుపాయాలకు, 18 పారిశ్రామిక వాడల్లో కొత్త నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. తిరువళ్లూరు, తిరునల్వేలి, తిరువారూరు, చెంగల్పట్టు జిల్లాల్లో రూ.28.33 కోట్లతో నిర్మించిన పారిశ్రామికవాడలు, కడలూరు జిల్లా మరుదాడిలో రూ.3.60 కోట్లతో ప్రైవేటు పారిశ్రామికవాడను, కోవై జిల్లా కిట్టాంపాళయం అరింజర్ అన్నా సహకార పారిశ్రామికవాడలో రూ.24.61 కోట్లతో మౌలిక సదుపాయాలతో నిర్మించిన ప్రైవేటు పారిశ్రామికవాడను స్టాలిన్ ప్రారంభించారు. కాంచీపురం జిల్లా తిరుముడివాక్కం పారిశ్రామికవాడలో రూ.2.60 కోట్లతో నిర్మించిన మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాన్ని, నామక్కల్ జిల్లా తిరుచెంగోడులో రూ. 8.20 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రంలో అదనపు భవనాలకు కూడా ఆయన ప్రారంభోత్సవం జరిపారు. ఇదే విధంగా కాంచీపురం జిల్లా తిరుముడివాక్కం పారిశ్రామికవాడలో రూ.29.27 కోట్లతో నిర్మించనున్న కార్మికుల క్వార్టర్స్‌కు, ఈరోడ్ జిల్లా పెరుంతురై సిడ్కో పారిశ్రామికవాడలో వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం రూ.15.23 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధిపనులకు, 18 పారిశ్రామికవాడల్లో సదుపాయాల మెరుగుపరిచేలా మరిన్ని భవనాలకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎంఆర్కే పన్నీర్ సెల్వం, దామో అన్బరసన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ఎంఎస్ఎంఈల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్ ఆనంద్, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఎ.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం విద్యార్థులకు రూ.10వేల సాయం...

రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన మరొక కార్యక్రమంలో ప్లస్-2 వరకు మంచి మార్కులతో ఉత్తీర్ణులై ఆర్థిక ఇబ్బందుల కారణంగా డిగ్రీ చదవలేకపోతున్న ముస్లిం విద్యార్థులకు విద్యా నగదు పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు తరపున యూజీ, పీజీ కోర్సులను చదివేందుకు సిద్ధంగా ఉన్న 2000 మంది ముస్లిం విద్యార్థులకు తలా రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ పథకం ప్రారంభోత్సవ సందర్భంగా పదిమంది విద్యార్థులకు ఆయన తలా రూ.10వేల విద్యా సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎస్ఎం నాజర్, ఎంపీ కే నవాజ్‌గనీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, బీసీ, ఓబీసీ, మైనారిటీల శాఖ కార్యదర్శి ఎ.శరవణవేల్ రాజ్, మైనారిటీల సంక్షేమ శాఖ కమిషనర్ ఎం. ఆసియామరియం తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలపై బీజేపీ నేతల మేధోమథనం


సమావేశంలో నేతలు

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, కూటమిలో కొత్త పార్టీల చేరిక తదితర అంశాలపై మంగళవారం జరిగిన బీజేపీ చింతనా సమావేశంలో పార్టీ నేతలు సమీక్ష జరిపారు. మహాబలిపురం సమీపంలోని ఓ హాలులో ఏర్పాటైన ఈ సమావేశానికి బీజేపీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పీఎల్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షుడు అన్నామలై, కేంద్రమంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర ఇన్‌చార్జులు అరవింద్ మేనన్, డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, పొన్ రాధాకృష్ణన్, డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, హెచ్.రాజా, వ్యవస్థాపక కార్యదర్శి కేశవ వినాయకన్, కరు నాగరాజన్, పార్టీ జిల్లా శాఖల కార్యదర్శులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, కూటమిలో సమస్యలపై నేతలు సమగ్రంగా చర్చించారు. కూటమి బలోపేతానికి నాయకులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం సాయంత్రం ఆరుగంటల దాకా సాగింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, రాష్ట్రంలో డీఎంకే అవినీతి, అక్రమాలపై, ఆ పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్రాలను ముద్రించి ఇంటింటా ప్రచారం చేయాలని సీనియర్ నేతలు జిల్లా నేతలకు సూచించారు.

అక్టోబర్ నుంచి నయినార్ ప్రచారం...

ఈ సమావేశంలో పాల్గొన్న అన్నామలై మాట్లాడుతూ.. అక్టోబర్ మొదటి వారం నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ రాష్ట్రంలో పర్యటిస్తారని ప్రకటించారు. ఈ ప్రచార పర్యటనలో కీలకమైన ప్రాంతాల్లో బహిరంగ సభలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పర్యటనకు పార్టీ స్థానిక నాయకులు మద్దతునివ్వాలని, జనసమీకరణకు తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అదనంగా 350 ఎంబీబీఎస్ సీట్లు

● నేడు రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం



అడయార్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి అదనంగా 350 ఎంబీబీఎస్ సీట్లు లభించాయి. దేశవ్యాప్తంగా 2024-25వ విద్యా సంవత్సరంలో 1,17,750 సీట్లున్న నేపథ్యంలో, 2025-26వ విద్యా సంవత్సరానికి 1,23,700కు పెరిగింది. దీనికి తోడు తాజాగా రాష్ట్రంలో రెండు స్వయం ప్రతిపత్తి కళాశాలలు, రెండు అన్ ఎయిడెడ్ వైద్యకళాశాలల్లో తలా 50 సీట్లు పెంచేందుకు జాతీయ వైద్య కమిషన్ అనుమతిచ్చింది. ఇప్పటికే గత వారం రాష్ట్రంలోని మూడు డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు తలా 50 సీట్లు పెంచిన విషయం తెలిసిందే.

రెండో విడత కౌన్సెలింగ్...

'నీట్-2025'లో అర్హత సాధించిన వారు బుధవారం నుంచి ఈ నెల 22వ తేది వరకు జరిగే రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు. ఏఏ కళాశాలల్లో ఎన్ని ఖాళీలున్నాయనే వివరాలు ఈ నెల 19న విడుదల చేయనున్నారు. కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత 23వ తేది సీట్ల కేటాయించ చేయనున్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 30వ తేది సాయంత్రం 5 గంటల్లోగా సంబంధిత కళాశాలలో చేరాల్సి ఉంది. మూడో విడత కౌన్సెలింగ్ ఈ నెల 28 నుంచి అక్టోబరు 8వ తేది వరకు నిర్వహించనున్నారు. సీటు పొందిన విద్యార్థులు అక్టోబరు 17వ తేదిలోగా కళాశాలల్లో చేరాలని ప్రకటించారు.. ఖాళీ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ అక్టోబరు 29వ తేది వరకు నిర్వహించనున్నారు. ఈ కౌన్సెలింగ్‌లో సీటు పొందిన వారు నవంబరు 5లోగా కళాశాలల్లో చేరాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ఈ నెల 22 నుంచి అన్ని యూజీ కళాశాలల్లో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించాలని జాతీయ వైద్య కమిషన్ నిర్ణయించిన విషయం తెలిసిందే.

తైలాపురానికి బారులు తీరిన

పీఎంకే శ్రేణులు

● రాందాస్ నివాసం వద్ద భద్రత పెంపు


రాందాస్ నివాసం వద్ద పోలీసు కాపలా


మీడియాతో మాట్లాడుతున్న మణి

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) అధ్యక్షుడిగా డాక్టర్ అన్బుమణిని కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించినట్లు ఆ పార్టీ న్యాయవిభాగం నేత, సీనియర్ న్యాయవాది కె.బాలు ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం ఉదయం పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌ను కలుసుకునేందుకు పార్టీ ప్రముఖులు బారులు తీరారు. దీంతో రాందాస్ నివాసం వద్ద పోలీసులు అదనపు భద్రత ఏర్పాటు చేశారు. తైలాపురం గార్డెన్ నలువైపులా సాయుధ బలగాలతో నిఘా వేశారు. మంగళవారం మధ్యాహ్నం పార్టీ గౌరవాధ్యక్షుడు జీకే మణి, వివిధ జిల్లాల నాయకులు తైలాపురం గార్డెన్‌లోని రాందాస్ నివాసానికి చేరుకున్నారు. జీకే మణి, పార్టీ సీనియర్ నాయకులు రాందాస్‌తో సమావేశమై పార్టీలో నెలకొన్న సంక్షోభంపై చర్చించారు. అన్బుమణి దూకుడుకు కళ్లెం వేసేలా ఎన్నికల సంఘం ఏకపక్ష నిర్ణయంపై న్యాయ పోరాటం జరపాలని రాందాస్‌కు పార్టీ నేతలు సూచించారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉండటంతో ఈ విషయంలో తొందరపడాల్సిన అవసరం లేదని జీకే మణి తదితర నేతలకు రాందాస్ ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. రాందాస్‌తో భేటీ అనంతరం జీకే మణి మీడియాతో మాట్లాడుతూ అన్బుమణిని పార్టీ అధ్యక్షుడిగా గుర్తించినట్లు తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తున్నారని ఆరోపించారు. పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) అధ్యక్షుడిగా డాక్టర్ రాందాసే కొనసాగుతారని స్పష్టం చేశారు.

సమాచార దర్శిని

నేడు రాజధాని కళాశాలలో ఉపన్యాసం

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా తీరంలోని రాజధాని కళాశాలలో బుధవారం ఉదయం 10.30 గంటలకు 'అభ్యుదయ కవిత్వంలో ఆరుద్ర' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం జరుగనుంది. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు మేడిపల్లి రవికుమార్ ఉపన్యసించనుండగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ ఎలిజబెత్ అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎం.మురళి స్వాగతం పలుకనుండగా, ఎం.ప్రేమవతి వందన సమర్పణ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.100 కోట్లతో సెమీ కండక్టర్ సెంటర్

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.వంద కోట్లతో సెమీ కండక్టర్ డిజైన్ అండ్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు డిట్కో టెండర్లు ఆహ్వానించింది. సెమీ కండక్టర్ తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, పారిశ్రామికవేత్తలకు సహాయపడేలా ఈ టెస్టింగ్ కేంద్రం, డిజైన్ సెంటర్, నైపుణ్య శిక్షణా కేంద్రాలతో ఈ ప్రాజెక్ట్ ఉంటుందని, ఈ ప్రాజెక్ట్ సమగ్ర నివేదిక తయారీకి టెండర్లు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు.

19 నుంచి ఎగ్మూర్ - మంగళూరు ఎక్స్‌ప్రెస్

అడయార్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎగ్మూర్-మంగళూరు సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 19వ తేది నుంచి ఎగ్మూర్ రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరుతాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఎగ్మూర్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ కారణంగా దక్షిణాది జిల్లాలకు వెళ్లే పలు రైళ్లు తాంబరం, ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లే రైళ్లు చెన్నై బీచ్ రైల్వేస్టేషన్ నుంచి నడుపుతున్నారు. ఈ మార్పు కారణంగా ప్రయాణికులు ఇబ్బంది పడుతుండడంతో, మళ్లీ పలు రైళ్లను తాంబరంకు బదులు ఎగ్మూర్ నుంచి నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, నెం.16159 చెన్నై ఎగ్మూర్-మంగళూరు సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19వ తేది యథావిధిగా ఎగ్మూర్ నుంచి బయల్దేరనుంది. అలాగే, నెం.16160 మంగళూరు సెంట్రల్- ఎగ్మూర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18 నుంచి తాంబరంకు బదులు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.

వర్షపు నీటి సేకరణకు 'స్పాంజ్ పార్క్'

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాడి, వ్యాసర్పాడి, దురైపాక్కం తదితర ప్రాంతాల్లో వర్షపు నీటిని సేకరించేలా 'స్పాంజ్ పార్క్' ఏర్పాటుపనులను సీఎండీఏ ప్రారంభించింది. నగరంలో వర్షపు నీరు సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు సేకరించేలా స్పాంజ్ పార్క్‌లు ఏర్పాటవుతున్నాయి. తాజాగా, చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) పార్క్‌లను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఆ ప్రకారం, పాడి ఇళంగో నగర్‌లో 4.79 ఎకరాలు, వ్యాసర్పాడి జీవా రైల్వేస్టేషన్ సమీపంలో 4.17 ఎకరాలు, దురైపాక్కం సెక్రటరీయేట్ కాలనీ సమీపంలో 5.17 ఎకరాల్లో 'స్పాంజ్ పార్క్'లు ఏర్పాటుకానున్నాయి. ఇందుకోసం వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక రూపొందించే పనులు ప్రారంభమయ్యాయని సీఎండీఏ అధికారులు తెలిపారు.

నేటినుంచి తిరుచ్చి-ఢిల్లీ విమాన సేవలు ప్రారంభం

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి-ఢిల్లీ మధ్య నేరుగా విమానా సేవలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం తిరుచ్చి నుంచి హైదరాబాద్ మీదుగా ఢిల్లీకి విమాన సేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో, సమయపాలన కారణంగా తిరుచ్చి-ఢిల్లీకి నేరుగా విమానాలు నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఇండిగో సంస్థ తిరుచ్చి నుంచి ఢిల్లీకి నేరుగా విమానాలు నడుపనుంది. ఆ ప్రకారం, తిరుచ్చి నుంచి ఉదయం 6 గంటలకు బయల్దేరే విమానం 9.15 గంటలకు ఢిల్లీ చేరుకుంటుంది. మరుమార్గంలో, ఢిల్లీ నుంచి మధ్యాహ్నం 2.10 గంటలకు బయల్దేరి సాయంత్రం 5.25 గంటలు తిరుచ్చి చేరుకోనుంది.ఈ విమానంలో తిరుచ్చి నుంచి ఢిల్లీకి రూ.6,785 ఛార్జీ నిర్ణయించినట్లు ఇండిగో సంస్థ తెలిపింది.

ఎన్ఎస్ఎస్ శిబిరాల నిర్వహణకు ఆంక్షలు

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఎన్ఎస్ఎస్ శిబిరాల నిర్వహణపై కఠిన ఆంక్షలు విధించారు. కొద్దికాలంగా పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరాల్లో విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురవుతున్న ఘటనలు జరుగుతున్నాయి. ఈ విషయమై దృష్టి సారించిన పాఠశాల విద్య శాఖ శిబిరాల నిర్వహణకు ఆంక్షలు విధించింది. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టర్ కన్నప్పన్ జిల్లా ప్రధాన విద్యాధికారులకు పంపిన సర్క్యులర్‌లో... శిబిరాల్లో పాల్గొనే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రాలు స్వీకరించాలని, విద్యార్థులను బయట ప్రాంతాలకు తీసుకెళ్లరాదని, శిబిరాలు నిర్వహించే ప్రాంతాలను అధికారులు తనిఖీ చేయాలంటూ సర్క్యులర్‌లో ఆదేశించారు.

'ఏసీ' బోగీల్లో 165 శాతం పెరిగిన ప్రయాణికుల సంఖ్య

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రతిరోజు రైళ్లలో సుమారు 2.50 కోట్ల మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో ఏసీ బోగీల్లో ప్రయాణిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. 2014లో ఏసీ బోగీల్లో ప్రయాణించే వారి సంఖ్య 3,27,129 ఉండగా, 2024 ఏప్రిల్ గణాంకాల ప్రకారం 8,68,592కు పెరిగింది. ఈ గణాంకాల ప్రకారం పదేళ్లలో ఏసీ బోగీల్లో ప్రయాణించే వారి సంఖ్య 165 శాతం పెరిగింది. ఆ ప్రకారం, చెన్నై నగరంలో ఏసీ బోగీల్లో ప్రయాణికుల సంఖ్య 34,990 నుంచి 87,992, ఢిల్లీలో 84,015 నుంచి 1,73,294, ముంబైలో 35,456 నుంచి 90,192, సికింద్రాబాద్‌లో 21,214 నుంచి 68,793కు పెరిగిందని అధికారులు తెలిపారు.

పాములు పట్టడంపై అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, అగ్నిమాపక, రక్షణ సేవల రంగంలోని క్షేత్రస్థాయి సిబ్బందికి పాములు ఎలా పట్టాలో శిక్షణ ఇవ్వాలని చెన్నై స్నేక్ ఫామ్ ఫౌండేషన్ నిర్ణయించింది. ఆ ప్రకారం, ఈ నెల 8 నుంచి అగ్నిమాపక సిబ్బందికి విడతల వారీగా శిక్షణ ఇస్తున్నారు. ఒక బృందంలో 35 మంది చొప్పున 14 బృందాలు, రాష్ట్రవ్యాప్తంగా 485 మందికి పాములు పట్టడంపై శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. ఆ ప్రకారం, మూడో బృందం శిక్షణ సోమవారం స్నేక్ ఫామ్‌లో ప్రారంభమైందని నిర్వాహకులు తెలిపారు.

వైద్య వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్ పెట్టొద్దు

● మానామదురైలో అఖిలపక్షాల ఆధ్వర్యంలో బంద్


మానామదురైలో బంద్ సందర్భంగా మూతపడిన దుకాణాలు

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా మానామదురై సిప్కాట్ పారిశ్రామికవాడలో వైద్య వ్యర్థాల శుద్ధీకరణ కర్మాగారం ఏర్పాటును వ్యతిరేకిస్తూ డీఎంకే మినహా అఖిలపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం బంద్ చేశారు. 13 జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు, ప్రైవేటు ఆస్పత్రులకు సంబంధించి వైద్య వ్యర్థాలను మానామదురై సిప్కాట్ పారిశ్రామికవాడకు తరలించి, శుద్ధీకరించే ప్లాంట్ నెలకొల్పేందుకు ఇటీవల పారిశ్రామికవాడ అధికారులు పర్యావరణ శాఖ సహా వివిధ శాఖల అనుమతి కూడా పొందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు వైద్య వ్యర్థాలను ఇక్కడ శుద్ధి చేస్తే వ్యాధులు వ్యాపించి, ప్రాణ హాని కూడా కలుగుతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పారిశ్రామికవాడలో వైద్య వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్ నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షాలు బంద్ పిలుపునిచ్చాయి. ఆ మేరకు మానామదురై పాతబస్టాండు, మెయిన్ బజార్, సుందరపురం బజారు వీధి, శివగంగ రోడ్డు, సిప్కాట్ ప్రాంతాలలోని వ్యాపారులంతా తమ దుకాణాలను మూసివేసి బంద్ పాటించారు. ఆ తర్వాత వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు సిప్కాట్ పారిశ్రామికవాడ వద్ద ధర్నా, రాస్తారోకో జరిపారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి పెరియకరుప్పన్ మానామదురై సిప్కాట్‌లో వైద్య వ్యర్థాల శుద్ధీకరణ కర్మాగారం నిర్మాణ పనులను వీలైనంత త్వరగా నిలిపివేస్తామని ఆందోళన చేస్తున్న పార్టీల ప్రతినిధులు, స్థానికులకు హామీ ఇచ్చారు.

చెల్లని నాణేలు పార్టీని విచ్ఛిన్నం చేస్తాయా?

● సెంగోట్టయన్, ఓపీఎస్‌లపై అన్నాడీఎంకే నేత ఉదయకుమార్ ధ్వజం

అడయార్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'ఐక్యత పేరుతో అన్నాడీఎంకేను విచ్ఛిన్నం చేయాలనే సెంగోట్టయన్, ఓ.పన్నీర్‌సెల్వం చెల్లని నాణేలు' అంటూ అన్నాడీఎంకే మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ విమర్శించారు. 1972లో ఎంజీఆర్ అన్నాడీఎంకేను ప్రారంభించగా, ఆయన తదనంతరం పార్టీ బాధ్యతలు చేపట్టిన జయలలిత, దేశంలోనే మూడో పెద్ద పార్టీగా అన్నాడీఎంకేను బలోపేతం చేశారన్నారు. ఆమె మరణానంతరం 8 కోట్ల మంది రాష్ట్ర ప్రజలు ఈపీఎస్ పై నమ్మకంతో ఉన్నారన్నారు. పార్టీలో ఈపీఎస్ ఎదుగుదలను అంగీకరించని కొందరు, ఐక్యత పేరుతో పార్టీని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం పార్టీ కార్యకర్తల దృష్టిలో వారు చెల్లని నాణేలుగా మారారని ఆర్బీ ఉదయకుమార్ తెలిపారు.

మైలాడుదురైలో పరువు హత్య

దళిత సంఘాల రాస్తారోకో


రాస్తారోకోలో దళిత సంఘాల కార్యకర్తలు (ఇన్‌సెట్‌లో మృతుడు వైరముత్తు ఫైల్‌ఫొటో)

ప్యారీస్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో ఓ యువకుడు పరువు హత్యకు గురైన ఘటన మైలాడుదురై ప్రాంతంలో కలకలం రేపింది. ఈ హత్యను ఖండిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వివరాలిలా.. మైలాడుదురై జిల్లా అడియమంగళం గ్రామానికి చెందిన కుమార్-రాజలక్ష్మి దంపతుల కుమారుడు వైరముత్తు (28) మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో అదేప్రాంతానికి చెందిన 26యేళ్ల యువతితో పదేళ్ల క్రితం వైరముత్తుతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. చెన్నైలో పనిచేస్తున్న ఆమె ఈనెల 5వ తేదీ బంధువుల వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు సొంతూరు వెళ్లగా కుటుంబసభ్యులు ఆమెకు వివాహ ఏర్పాట్లు చేపట్టారు. ఇందుకు అభ్యంతర తెలిపిన ఆ యువతి తాను వైరముత్తును ప్రేమిస్తున్నానని, అతడినే వివాహం చేసుకుంటానని తేల్చిచెప్పింది. ఈ ప్రేమకు అంగీకరించని ఆమె కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగింది. ఇదిలా వుండగా, ఆ యువతి సోదరులు గుహన్, గునాల్ ఆమెపై దాడి చేయడంతో పాటు వైరముత్తు పనిచేస్తున్న స్థలానికి వెళ్లి బెదిరించారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రెండు కుటుంబాలను పిలిపించి చర్చించారు. ఆ యువతి అభిప్రాయం తెలుసుకుని, ఆమె ఇష్టం మేరకు వైరముత్తు ఇంటికి పంపించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో, సోమవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్న వైరముత్తుపై గుహన్, గునాల్ మారణాయుధాలతో దాడి చేసి హత్య చేశారు. ప్రేమికులు ఒకే కులానికి చెందినవారైనప్పటికీ యువతి తల్లి వేరే కులానికి చెందినవారు కావడంతో ఆమే వీరి ప్రేమకు అభ్యంతర తెలిపినట్లు విచారణలో తేలింది. తల్లి ప్రేరణతో సోదరులిద్దరూ ఈ దారుణానికి పాల్పడినట్లు స్పష్టమైంది. కాగా హంతకులను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల నాయకులు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. యువతి తల్లి వైరముత్తును బెదిరించిన వీడియో ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఊటీలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు

● కర్ణాటక అధికారులకు జరిమానా


స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను పరిశీలిస్తున్న అధికారులు

చెన్నై,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఊటీకి నిషేధిత ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లతో వచ్చిన కర్ణాటక రాష్ట్రం చిక్‌మంగళూరు మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, చిక్‌మంగళూరు ఎమ్మెల్యే తదితరులకు ఊటీ మున్సిపల్ అధికారులు జరిమాన విధించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిగక్‌మంగళూరు మున్సిపాలిటీ అధికారులు ఊటీలో అమలవుతున్న వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలించేందుకు కొద్ది రోజుల క్రితం వచ్చారు. బస్సులో వచ్చిన ఆ అధికారులు ఊటీలో నిషేధిత ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను తీసుకు వచ్చినట్లు ఊటీ మున్సిపాలిటీ అధికారులకు సమాచారం అందింది. వెంటనే ఊటీ మున్సిపాలిటీ సిబ్బంది ఆ బస్సులో తనిఖీ చేసి 60 ప్లాస్టిక్ వాటర్‌బాటిళ్లను చిక్‌మంగళూరు మున్సిపల్ అధికారులు వెంట తీసుకువచ్చినట్లు వెల్లడైంది. దీనితో ఒక్కో బాటిల్ రూ.100ల చొప్పున రూ.6 వేల జరిమానా విధించారు.

డ్రైవర్, కండక్టర్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు


ఆల్కహాల్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు 'ఆల్కహాల్' పరీక్షలు నిర్వహిస్తున్నారు. రవాణా శాఖ నడుపుతున్న బస్సుల్లో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లలో కొందరు మద్యం సేవిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.మద్యం సేవించిన రవాణా సిబ్బంది ప్రయాణికులతో ఘర్షణకు దిగిన ఘటనలు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బస్సు డ్రైవర్లకు ఆల్కహాల్ పరీక్షలు నిర్వహించాలని రవాణాశాఖ ఆదేశించింది. తిరువళ్లూర్ జిల్లాలోని ఐదు డిపోల్లో డ్రైవర్లు, కండక్టర్లకు పరీక్షలు నిర్వహించేందుకు పరికరాలు సరఫరా చేశారు. ఈ విషయమై తిరువళ్లూర్ మండల రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ... డిపోల్లో విధులకు వచ్చే డ్రైవర్లు, కండక్టర్లను పరీక్షించనున్నారు. ఈ పరికరంతో పరిశీలించిన వెంటనే, డ్రైవర్లు, కండక్టరు పేరుతో వివరాలు ప్రింట్ పొందవచ్చని తెలిపారు. మద్యం సేవించి విధులకు వచ్చే సిబ్బందిపై కఠిన చర్యలు చేపట్టనున్నట్లు అధికారి తెలిపారు.

ఆయుధపూజ, దీపావళి సందర్భంగా ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆయుధపూజ, దీపావళి పండుగల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● నెం.06012 నాగర్‌కోయిల్-తాంబరం ప్రత్యేక వారాంతపు సూపర్ ఫాస్ట్ రైలు ఈ నెల 28, అక్టోబరు 5,12,19,26 తేదీల్లో (ఆదివారం) నాగర్‌కోయిల్‌లో రాత్రి 11.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06011 తాంబరం-నాగర్‌కోయిల్ ప్రత్యేకవారాంతపు సూపర్‌ఫాస్ట్ రైలు ఈనెల29, అక్టోబరు 6,13,20,27 తేదీల్లో తాంబరంలో మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 5.15 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. ● నెం.06123 చెన్నై సెంట్రల్-పోదనూరు వారాంతపు సూపర్ ఫాస్ట్ స్పెషల్ ఈ నెల 25, అక్టోబరు 2,9,16,23 తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి రాత్రి 11.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు పోదనూరు చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06124 పోదనూరు-చెన్నై సెంట్రల్ వారాంతపు సూపర్‌ఫాస్ట్ స్పెషల్ ఈ నెల 26, అక్టోబరు 3,10,17,24 తేదీల్లో పోదనూరు నుంచి సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు వేకువజామున 3.15 గంటలక చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.

కొత్త డీజీపీ ఎంపికపై 26న ఢిల్లీలో సమావేశం

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాంతి భద్రతల విభాగం డీజీపీ ఎంపికకు సంబంధించిన సమావేశం ఈ నెల 26న ఢిల్లీలో జరుగనుంది. రాష్ట్ర పోలీసు శాఖ అధ్యక్షుడు, శాంతి భద్రతల డీజీపీగా వ్యవహరించిన శంకర్ జివాల్ గత నెల 31న పదవీ విరమణ చేశారు. డీజీపీ పదవీ విరమణకు మూడు నెలల ముందుగా కొత్త డీజీపీ పదవికి అర్హులైన వారితో కూడిన జాబితా కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరుగుతోంది. ఈ జాబితాలో తనను చేర్చాలంటూ డీజీపీ ప్రేమ్ కుమార్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారనే కారణంగా జాబితాను పంపించకుండా రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేసింది. అదే సమయంలో జూనియర్ అయిన వెంకట్రామన్‌ను ఇన్‌చార్జీ డీజీపీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో, గత నెల 29వ తేది కొత్త డీజీపీకి అర్హులైన వారి జాబితా కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. ఈ జాబితా ఈనెల 1వ తేది యూపీఎస్సీ కార్యాలయానికి చేరింది. ఈ జాబితాలో రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ సీమా అగర్వాల్, పోలీసు శిక్షణ సంస్థ డైరెక్టర్ సందీప్‌రాయ్ రాథోడ్ పేర్లున్నాయి. వీరిపై నేరారోపణలు ఉన్నాయా? అవినీతి కేసులు ఉన్నాయా? అనే అంశంపై చేపట్టిన విచారణ ముగిసింది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర శాంతి భద్రతల కొత్త డీజీపీ ఎంపికకు సంబంధించిన సమావేశం, ఢిల్లీలో ఈ నెల 26న యూపీఎస్సీ కార్యాలయంలో జరుగనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శి తదితర అధికారులు పాల్గొననున్నారు.

ఈపీఎస్ ఫ్లెక్సీల తొలగింపు

అడయార్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నామక్కల్‌లో ఎడప్పాడి పళనిస్వామి పర్యటన సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చింపివేయడం ఉద్రిక్తతకు దారితీసింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఈ నెల 19 నుంచి మూడు రోజులు నామక్కల్ జిల్లాలో పర్యటించనున్నారు. పళనిస్వామికి స్వాగతం పలుకుతూ అన్నాడీఎంకే రాష్ట్ర వ్యాపార విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీదేవి మోహన్ నేతృత్వంలో సేలం రోడ్డు, తిరుచెందూర్ రోడ్డు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఈ ఫ్లెక్సీలను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చింపేశారు. అన్నాడీఎంకే నెలకొన్న విభేదాల కారణంగా ఫ్లెక్సీలు తొలగించారా? మరెవరి పనా? అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు.

నగరంలో 46,122 వీధిశునకాలకు రేబిస్ టీకాలు



పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో 46,122 వీధిశునకాలకు రేబిస్ టీకా వేసినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... నగరంలో వీధి శునకాల దాడికి గురవుతున్న వారి సంఖ్య అధికమవుతోంది. శునకాల దాడిలో గాయపడి రాబిస్ సోకి పలువురు మృతిచెందిన ఘటనలు కూడా ఉన్నాయి.. దీనిపై దృష్టి సారించిన జీసీసీ, వీధి శునకాలకు రాబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేసేందుకు చర్యలు చేపట్టారు. గత నెల 9వ తేది మేయర్ ప్రియ ప్రారంభించిన టీకా కార్యక్రమంలో వెటర్నరీ బృందాలు బృందాలుగా ఏర్పడి వీధిశునకాలకు టీకాలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... వీధిశునకాల సంతానోత్పత్తి నివారించేలా 2021 నుంచి 71,475 వీధిశునకాలకు స్టెరిలైజేషన్ చేశారు. అలాగే, నగరంలో 12,255 వీధిశునకాలకు మైక్రో చిప్స్ అమర్చారు. రాబిస్ వ్యాధితో బాధపడుతున్న శునకాలను గుర్తించి క్వారంటైన్‌లో ఉంచారు. కాగా, జీసీసీ పరిధిలో నెల రోజుల్లో 46.122 వీధి శునకాలకు రాబిస్ టీకా వేసినట్లు జీసీసీ తెలిపింది.

ఆమ్నీ బస్సులో 3 కేజీల బంగారం చోరీ

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా శంకగిరి వద్ద సోమవారం అర్ధరాత్రి ఆమ్నీ బస్సులో ఓ ప్రయాణికుడు తీసుకెళుతున్న 3 కేజీల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. కోవై నుంచి పుదుచ్చేరికి వెళ్లే అమ్ని బస్సులో ధర్మపురికి చెందిన ఈశ్వరన్, మణివన్నన్ అనే ఇద్దరు డ్రైవర్లు, 24 మంది ప్రయాణికులు ప్రయాణించారు. రాత్రి 12.45 గంటలకు సేలం జిల్లా శంకగిరి వద్ద బస్సు ఆపి అందరూ రోడ్డుపక్కనే ఉన్న టీ దుకాణానికి వెళ్లారు. ఆ సమయంలో బస్సులోని కోయంబత్తూరుకు చెందిన శంకర్ (45) అనే వ్యక్తి తన బ్యాగ్‌లో 3 కేజీల బంగారు నగలు కనిపించడంలేదంటూ కేకలు పెట్టారు. వెంటనే బస్ డ్రైవర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. కోయంబత్తూరులో శీనివాసన్ అనే వ్యక్తి నడుపుతున్న నగల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న శంకర్ యజమాని సలహా మేరకు పుదుచ్చేరిలోని నగల వ్యాపారులకు ఇచ్చేందుకు 3 కేజీల నగలతో బస్సులో ప్రయాణించాడని తెలుసుకున్నారు. పోలీసుల విచారణలో బస్సులోని ప్రయాణికుల్లో విజి బాబు అనే వ్యక్తి మాయమైనట్లు గుర్తించి, నగలను అతడే అపహరించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ ప్రాంతంలో సీసీ ఫుటేజీ ఆధారంగా దోపిడీ దొంగను కనుగొనేందుకు చర్యలు చేపడుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. **అడయార్:** వెంకటేశ్వర నగర్, ఎంజీఆర్ నగర్, బైపాస్ రోడ్డు, దేవికరుమారి అమ్మన్ నగర్, శశి నగర్, పద్మావతి నగర్, మురుగన్ నగర్, విజయా నగర్, గంగై నగర్, భువనేశ్వరి నగర్, రామ్ నగర్, నెహ్రూ నగర్, దండీశ్వరం నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, వందడుగుల రోడ్డు, రాజలక్ష్మి నగర్, జగన్నాథపురం, తిరుపాత్తి అమ్మన్ ఆలయం, గాంధీ వీధి, టాన్సీ నగర్, వీజీపీ సెల్వ నగర్, సీతారామ్ నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, తరమణి, బేబి నగర్. **పమ్మల్:** ఈస్ట్ మెయిన్ రోడ్డు, అప్పాస్వామి శంకర్ నగర్ మెయిన్ రోడ్డు, గాంధీ మెయిన్ రోడ్డు, శంకర్ నగర్ 2వ క్రాస్ వీధి, శంకర్ నగర్ 17 నుంచి 27 వీధులు, పిళ్లయార్ ఆలయ వీధి, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు. **తరమణి:** కామరాజ్ అవెన్యూ 1,2 వీధులు, 3వ క్రాస్ వీధి, కస్తూరిబాయ్ నగర్, కెనాల్ బ్యాంక్ రోడ్డు, జస్టిస్ రామస్వామి వీధి, వెంకటరత్నం నగర్ మెయిన్ రోడ్డు, టీచర్స్ కాలనీ 4 నుంచి 8 మెయిన్ రోడ్లు, కస్తూరిబాయ్‌నగర్ 6నుంచి 15క్రాస్‌వీధులు,ఇందిరానగర్. **సెంబియం:** ఎంహెచ్ రోడ్డు, కొల్లం తోట్టం, సెయింట్ మేరీస్ రోడ్డు, చొక్కలింగం వీధి, చిన్న కులందల్ 1 నుంచి 4 వీధులు, ఎస్ఎస్‌వీ ఆలయం 1 నుంచి 3 వీధులు, ఎన్ఎస్‌కే వీధి, మోతిఅళగన్ వీధి, సీతారామన్ 1 నుంచి 6 వీధులు, నరసింహ రెడ్డి నగర్ 1 నుంచి 4 వీధులు, మనలి హైరోడ్డు, స్కూల్ రోడ్డు.

విద్యార్థుల మధ్య ఘర్షణకు దారితీసిన 'ఫ్రీ ఫైర్' గేమ్

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న విద్యార్థులు వర్గాలుగా విడిపోయి పరస్పరదాడులకు పాల్పడిన ఘటన తిరునల్వేలి జిల్లాలో చోటుచేసుకుంది. సుద్ధమల్లి ప్రాంతంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 10, ప్లస్ వన్, ప్లస్ టూ తరగతులకు చెందిన కొందరు విద్యార్థులు, సహచర విద్యార్థులతో బృందంగా ఏర్పడి 'ఫ్రీ ఫైర్' అనే ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్నారు. సోమవారం ఉదయం ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న రెండు బృందాల మధ్య తలెత్తిన వివాదం పరస్పరదాడులకు పాల్పడ్డారు. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం సుద్ధమల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పాఠశాలకు చేరుకుని విచారించి 13 మంది విద్యార్థులపై కేసు నమోదుచేసి, వారిని కోర్టులో హాజరుపరచి బెయిలుపై విడుదల చేశారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరికి ఆరేళ్ల జైలు

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరికి ఆరేళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. 2016లో తూత్తుకుడి సిప్కాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధనశేఖరన్ ప్రాంతంలో ఉన్న ఓ ఇంట్లో ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులు, ఇంట్లో ఉన్న మహిళను తాగేందుకు నీరివ్వాలని కోరారు. ఆమె నీరు తెచ్చిన వెంటనే కత్తితో బెదిరించి, ఆమె మెడలోని బంగారు చైన్ లాక్కొని పరారయ్యారు. ఈ కేసును విచారించిన సిప్కాట్ పోలీసులు, తూత్తుకుడి కృష్ణరాజపురానికి చెందిన రాబిన్‌సన్ (43), తూత్తుకుడి ముల్లకాడు ప్రాంతానికి చెందిన సుందరమూర్తి (38)లను అరెస్ట్ చేశారు. ఈ కేసు తూత్తుకుడి క్రిమినల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో, నిందితులకు తలా ఆరేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

సైకిల్ చోరీ... ఒకరి అరెస్ట్

అడయార్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు నిలిపిన సైకిల్‌ను చోరీచేసిన వ్యవహారంలో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పటాలం ఖాజాసాహెబ్ వీధికి చెందిన జయకుమార్ కుమారుడు తన సైకిల్‌ను ఇంటి ముందుంచుతాడు. గత నెల 13న సైకిల్ ఇంటి ముందు పెట్టి, కొద్దిసేపటి తర్వాత వచ్చి చూడగా సైకిల్ కనిపించలేదు. చుట్టూ గాలించినా ఫలితం లేకపోవడంతో 22వ తేది పులియాంతోపు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, ఆ ప్రాంతంలో సీసీ ఫుటేజీ ఆధారంగా పులియాంతోపుకు చెందిన విష్ణు (36)ను అరెస్ట్ చేసి, అతడి నుంచి సైకిల్ స్వాధీనం చేసుకున్నారు.

బాలికకు లైంగిక వేధింపులు

● వృద్ధుడి అరెస్ట్


తిరుత్తణి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన సంఘటన తిరువళ్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కాంచీపురం జిల్లా వేంపాక్కం గ్రామానికి చెందిన పెరుమాళ్ (65)అనే వృద్ధుడు ఆర్కేపేటలో తాపీమేస్త్రిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తాను పనిచేస్తున్న స్థలానికి సమీపంలోని పాఠశాలకు వెళుతున్న బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి పరారైయ్యాడు. దీనిపై బాధితురాలు పాఠశాల ఉపాధ్యాయులకు తెలుపగా, ఆర్కేపేట మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు 24గంటల్లోనే నిందితుడు పెరుమాళ్‌ను పట్టుకుని అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు పుళల్ జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

● కారు డ్రైవర్ అరెస్ట్

ప్యారీస్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వానగరంలో కారు ఢీకొని ఇద్దరు మృతిచెందిన ఘటనకు సంబంధించి కారు డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మధురవాయల్ నుండి తిరువేర్కాడు వైపు వెళ్తున్న ఓ కారు వానగరం చేపల మార్కెట్ సమీపంలో బైక్‌లో వెళుతున్న వ్యక్తిని, నడిచి వెళుతున్న మరో వ్యక్తిని ఢీకొని ఆగకుండా వెళ్లింది. ఆ ప్రాంతంలో కొంతమంది బైక్ మీద వెళ్లి కారును వెంటాడి వేళప్పన్‌చావడి సిగ్నల్ వద్ద అడ్డుకున్నారు. కారు అద్దాలు ధ్వంసం చేసి డ్రైవర్‌ను చితకబాది తిరువేర్కాడు పోలీసులకు అప్పగించారు. సీఐ రాజ్‌కుమార్ జరిపిన విచారణలో కారు డ్రైవర్ తిరువేర్కాడు మహాలక్ష్మినగర్‌కు చెందిన శ్రీనివాసన్ (32) అని తెలిసింది. అతడిని మానసిక రోగిగా పరిగణించి వానగరంలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇదిలా వుండగా, కారు ఢీకొన్న ఘటనలో మృతిచెందిన వ్యక్తుల వివరాలను ఆరాతీస్తున్నట్లు మధురవాయల్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

కున్నూరు ఘాట్‌లో ఆడ ఏనుగు మృతి



చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూరు కొండ రహదారిలో ఆదివారం సాయంత్రం ఆడ ఏనుగు కాలుజారి గోతిలోపడి అక్కడికక్కడే మరణించింది. ఈ ప్రమాదంలో ఆ ఏనుగు కడుపులో ఉన్న గున్న ఏనుగు కూడా మృతి చెందింది. ఈ సంఘటనను పాదచారులు గమనించి అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కన్నూరు రేంజర్ రవీంద్రనాథ్, ఇతర సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి వెళ్ళి ఏనుగు కళేబరానికి తరలించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో వచ్చిన మూడు ఏనుగులు ఆ కళేబరం చుట్టూ కాపలాగా నిలిచాయి. అటవీ శాఖ సిబ్బంది అతికష్టం మీద అడవిలోకి పంపారు. ఆ తర్వాత వెటర్నరీ డాక్టర్లతో ఆ ఏనుగు కళేబరానికి పోస్టుమార్టం జరిపి అక్కడే ఖననం చేశారు.

12 మందిని చంపిన అడవి ఏనుగు కోసం గాలింపు



పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కూడలూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలో 12 మందిపై దాడి చేసి హతమార్చిన అడవి ఏనుగును బంధించాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ వైల్డ్ లైఫ్ రాకేష్ కుమార్ డోగ్రా ఆదేశించారు. జిల్లాలోని కూడలూరు, పందలూరు, సేరంపాడి, పాడన్‌దురై, దేవల్ సహా పలు ప్రాంతాల్లోని జనావాసాలకు ఆహారం కోసం అడవుల నుంచి వస్తున్న ఏనుగులు, ఇళ్లు, దుకాణాలను ధ్వంసం చేయడంతో పాటు ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. గ్రామాల్లోకి ఏనుగులు రాకుండా అడ్డుకోవాలంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, కూడలూరు రేంజ్ పరిధిలో 12 మందిపై దాడిచేసి హతమార్చిన ఏనుగును బంధించాలని అటవీ శాఖ ఉత్తర్వులు జారీచేయడంతో ఆ శాఖాధికారులు ఆ ఏనుగు కోసం వేట ప్రారంభించారు.



అలనాటి నటీమణి ఎంఎన్ రాజంకు

'జీవిత సాఫల్య పురస్కారం'

అలనాటి నటీమణి ఎంఎన్ రాజంకు నడిగర్ సంఘం 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రదానం చేయనుంది. ఈ నెల 21న జరిగే నడిగర్ సంఘం సమావేశంలో ఆమెకు ఈ అవార్డు అందజేస్తారు. ఈ మేరకు ఎంఎన్ రాజంను నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, కోశాధికారి కార్తి స్వయంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కాగా, 1950 నుంచి 1960 వరకు ఎంజీఆర్, శివాజీ సరసన నాయికగా నటించిన రాజం.. 'రత్తకన్నీర్', 'పెన్నిన్ పెరుమై', 'పుదైయల్', 'తంగపదుమై', 'నాడోడి మన్నన్', 'పాసమలర్', 'తాళి భాగ్యం', 'అలిబాబావుమ్ 40 తిరుడర్గళుం', 'అరంగేట్రం' వంటి ఎన్నో హిట్ చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. తన కెరీర్‌లో దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించిన రాజం... అనేక చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలు పోషించారు. కాగా ఈ నెల 21న నడిగర్ సంఘం సర్వసభ్య సమావేశం తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో జరుగనుంది. ఇందులో అగ్రనటులు కమల్ హాసన్, రజినీకాంత్‌లకు సన్మానం తదితర అంశాలపై చర్చించనున్నారు.

సెన్సార్ బోర్డులో రైట్ వింగ్ ఆధిపత్యం

చిత్రజ్యోతి

● పా.రంజిత్

గతంలో వామపక్షవాదుల ఆధిక్యం ఉండేదని ఇపుడు దేశంతోపాటు సెన్సార్ బోర్డులో కూడా రైట్ వింగ్ ఆధిపత్యం పెరిగిపోయిందని ప్రముఖ దర్శకుడు, నిర్మాత పా.రంజిత్ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాత, దర్శకుడైన పా.రంజిత్ తన సొంత నిర్మాణ సంస్థ నీలం ప్రొడక్షన్స్ లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్స్ అధినేత ఎస్.సాయి దేవానంద్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'దండకారణ్యం'. అదియన్ ఆదిరై దర్శకుడు. దినేష్, కలైయరసన్, షబీర్, బాలశరవణన్, ముత్తుకుమార్, రిత్విక, విన్షు తదితరులు నటించగా ఈ నెల 19న విడుదల చేస్తున్నారు. దీన్ని పురస్కరించుకుని చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్ నగరంలో తాజాగా నిర్వహించారు. ఈ సందర్భంగా పా.రంజిత్ మాట్లాడుతూ 'సాయితో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించడంతో పాటు ఈ మూవీ కోసం సాయి వెంకటేశ్వరన్ కలిసి పనిచేశారు. నేను డబ్బు సంపాదన కోసం సినిమా ల్లోకి అడుగుపెట్టలేదు. సమాజాన్ని మెరుగుపరచాలన్న ఉద్దేశ్యంతో వచ్చాను. దర్శకుడిగా మూడేళ్లకు మించి కొనసాగలేనని భావించాను. ఎందుకంటే నా భావాలను ఈ సమాజంలోని కొన్ని వర్గాలు అంగీకరించవని అనుకున్నాను. కానీ, ప్రేక్షకులు నా చిత్రాలకు ఆదరించడంతో దర్శకుడిగా కొనసాగుతున్నాను. గతంలో దేశంలో లెఫ్ట్ వింగ్ ఉండేది. ఇపుడు రైట్ వింగ్ ఆధిపత్యం పెరిగింది. సెన్సార్ బోర్డులోనూ రైట్ వింగ్ సభ్యులే డామినేట్ చేస్తున్నారు. నీలం ప్రొడక్షన్ పతాకంపై వరుసగా 'వేట్టువం', 'బైసన్' చిత్రాలు రిలీజ్ కానున్నాయి. ఇవికాకుండా మరో మూడు చిత్రాలు నిర్మించనున్నాం' అని పేర్కొన్నారు.





అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ ప్రియ

తిరువికా నగర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

పారీస్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) మేయర్ ప్రియ మంగళవారం తిరువికానగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. తిరువికానగర్‌లోని జోన్ 74వ వార్డు పరిధిలో ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింద భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల మరమ్మతులు తదితర పనులు ఈ వార్డులో 1 నుండి 9 వీధుల్లో జరుగుతున్నాయి. ఈ పనులను జీసీసీ అధికారులతో కలిసి పరిశీలించిన మేయర్ పాదచారులకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు ఆదేశించారు. మేయర్‌తో పాటు జోనల్ అధికారి చొక్కలింగం, చెన్నై మెట్రోవాటర్ బోర్డు చీఫ్ ఇంజనీర్ రాధాకృష్ణన్ తదితరులున్నారు.

సినిమాగా వీధి నాటకం 'కనగవల్లి'



'కనగవల్లి' నాటకంలో ఓ దృశ్యం

జయరావు 'సేవూరి దర్శకత్వంలో 'కనగవల్లి' అనే వీధి నాటకం సినిమాగా రూపుదిద్దుకొనుంది. రువా ప్రమోటర్స్ పతాకంపై విష్ణుష్, వేలుమణి నిర్మాణ సారథ్యంలో తెరకెక్కే ఈ చిత్రంలో 'స్వేచ్ఛ' చక్రవర్తి హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇతర పాత్రలను శ్రీకాంత్, అదర్శ, ఆది, మునీష్ కాంత్, వినోద్ సాగర్ తదితరులు పోషించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన స్వేచ్ఛ భరతనాట్యం, మార్షల్ ఆర్ట్స్, సంగీతంలో శిక్షణ పొందారు. 24 యేళ్ళ స్వేచ్ఛ.. ఇందులో బలమైన పాత్ర పోషించనున్నారు. ఈ కథను తన పాత్ర ద్వారా ముందుకు తీసుకెళ్తారన్న నమ్మకం ఉందని దర్శకుడు జయరావు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మూవీ వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'చాలా బాగా అభివృద్ధి చెందిన ఓ గ్రామంలో ఆకస్మికంగా వరదలు సంభవించడంతో ఆ గ్రామ ప్రజలు కష్టాల ఊబిలో చిక్కుకుంటారు. ఆ గ్రామానికి సామాజిక ఓ కార్యకర్త ప్రజలకు ఆశ్రయం కల్పిస్తాడు. దీన్ని జీర్ణించుకోలేని ఆ గ్రామానికి చెందిన కొందరు ధనవంతులు.. గ్రామంలోని ఇళ్లు, పశువులు, పంటలను రహస్యంగా నాశనం చేస్తుంటారు. ఈ గ్రామానికి చెందిన వారే ఈ విధ్వంసం సృష్టిస్తున్నారన్న విషయాన్ని గ్రామ ప్రజలు గ్రహించలేకపోతారు. ఈ తరుణంలో గ్రామానికి చెందిన సునీత అనే యువతి 'కనగవల్లి' అనే దేవతగా మారి గ్రామ ప్రజలను కష్టాల నుంచి కాపాడుతుంది. ఈ కథను నేటి తరం యువతీ యువకులు, కుటుంబ సభ్యులు మెచ్చేలా రూపొందిస్తున్నాం' అని వెల్లడించారు.

'తమిళనాడు తల వంచనివ్వను'

క్యాప్షన్‌తో సీఎం ఫొటో



పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ తన ఎక్స్ పేజీలో చురుగ్గా ఉంటారు. రాష్ట్ర, దేశీయ పరిస్థితులు, ఘటనల సమయాల్లో ఆయన వెంటనే తన ఎక్స్ పేజీలో స్పందిస్తుంటారు. అలాగే, ప్రభుత్వం, పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు గుణంగా తన ఎక్స్‌లో ఫొటో కింద సీఎం వ్యాఖ్యలు మార్చుతుంటారు. గతంలో సీఎం ఫొటో కింది భాగంలో 'ఒరణియిల్ తమిళనాడు' అంటూ వాక్యం చోటుచేసుకుంది. తాజాగా, సీఎం ఫొటో కింద 'తమిళనాడు తల వంచనివ్వను (తమిళనాట్టై తలైకునియ విడమాట్టేన్)' అంటూ పొందుపరిచారు.

కోలీవుడ్‌కు మరో శాండల్‌వుడ్ భామ



కన్నడ చిత్రపరిశ్రమలో బాలనటిగా పరిచయమైన శాన్య అయ్యర్ ఆ తర్వాత పలు కన్నడ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు. అలాగే, కన్నడ బిగ్‌బాస్ సీజన్ 1 విజేతగా కూడా నిలిచారు. గత యేడాది విడుదలైన 'గౌరి' అనే చిత్రంలో హీరోయిన్‌గా నటించగా, ఇటీవల దుబాయ్ వేదికగా జరిగిన సైమా అవార్డుల్లో ఆమెకు 'ప్రామిసింగ్ న్యూ కమర్' అవార్డు వరించింది. ఇదిలా ఉండగా ఇపుడు తమిళ చిత్రపరిశ్రమలో అడుగుపెట్టేందుకు అమితాసక్తి చూపుతుంది. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, 'బాల నటిగా ప్రారంభించి 15 యేళ్ళు గడిచిపోయాయి. నాపై అమితమైన ప్రేమాభిమానాలు చూపుతున్న అభిమానులు, స్నేహితులు, ప్రేక్షకులు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. భాషను అతీతంగా నా సినీ ప్రయాణం చేయాలని భావిస్తున్నాను. ఈ కోరిక కూడా త్వరలోనే నెరవేరనుంది. తమిళంతో పాటు మరికొన్ని చిత్రాల్లో నటించేందుకు సంప్రదింపులు జరుగుతున్నాయి' అని వెల్లడించారు.

రేపటి నుంచి థియేటర్లలో

ప్రధాని మోదీ చిత్ర ప్రదర్శన

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ థియేటర్లలో ఈ నెల 18 నుంచి 24వ తేది వరకు ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలపై ప్రత్యేక చిత్రం ప్రదర్శించనున్నట్టు బీజేపీ రాష్ట్ర ప్రతినిధి ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... బుధవారం నుంచి అక్టోబరు 2వ తేది వరకు ప్రధాని నరేంద్ర మోదీ, దివంగత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జన్మదిన వేడుకలతో పాటు ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమాల్లో భాగంగా గురువారం నుంచి ఈ నెల 24వ తేది వరకు నగరంలోని ప్రముఖ థియేటర్లలో, ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలపై ఒక గంట ప్రత్యేక చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు తమ జిల్లాల్లోని ఒక థియేటర్‌ను ముగ్గురితో కూడిన బృందాన్ని ఏర్పాటుచేసి, ముందుగానే టిక్కెట్లు రిజర్వేషన్ చేసి, పాఠశాల, కళాశాల విద్యార్థులు, స్వయం సహాయక బృందాల సభ్యులు, ప్రజలు కుటుంబాలతో ఈ ప్రత్యేక ప్రదర్శన తిలకించేలా చర్యలు చేపట్టాలని ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

పోలీసులకు రైఫిల్ షూటింగ్ పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న తూత్తుకుడి జిల్లా ఎస్పీ ఆల్బర్ట్ జాన్

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి వల్లనాడు రైఫిల్ షూటింగ్ శిక్షణ కేంద్రంలో రైఫిల్ షూటింగ్ పోటీలను జిల్లా ఎస్పీ ఆల్బర్ట్ జాన్ ప్రారంభించారు. ఈ కేంద్రంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో తూత్తుకుడి, తిరునెల్వేలి, తెన్‌కాశి, తిరునెల్వేలి టౌన్, తమిళనాడు 9,11,12వ ప్రత్యేక పోలీసు బెటాలియన్లకు చెందిన డీఎస్పీలు, ఏడీఎస్పీలు 22 మంది ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పోటీల విజేతలకు మంగళవారం సాయంత్రం బహుమతి ప్రదానం చేశారు.

నేడు నగరంలో

'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

అడయార్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో బుధవారం జరుగనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ తెలియజేసింది. తిరువొత్తియూర్ మండలం 6వ వార్డు వికెటాల్ రోడ్డు కాళి ఆలయ మైదానం, మాధవరం మండలం 33వ వార్డు భారతీయార్ వీధిలోని ఏలుమలై నాయకర్ మండపం, తండయార్‌పేట మండలం 46వ వార్డు వ్యాసర్పాడి సత్యమూర్తి నగర్ సికల్యాణపురంలోని చెన్నై మహోన్నత పాఠశాల, రాయపురం మండలం 56వ వార్డు భవనకారా వీధిలోని జైన్ విలాస్, తిరువిక నగర్ మండలం 73వ వార్డు పటాలం స్ట్రాహాన్స్ రోడ్డులోని 6వ మండలం కార్యాలయంలో శిబిరాలు జరుగనున్నాయి. అలాగా అంబత్తూర్ మండలం 79వ వార్డు వెంకటాపురం రెడ్‌హిల్స్ రోడ్డులోని అరుళ్‌జ్యోతి కల్యాణ మండపం, తేనాంపేట మండలం 125వ వార్డు మైలాపూర్ శాంతోమ్ హైరోడ్డులోని శాంతోమ్ మహోన్నత పాఠశాల, కోడంబాక్కం మండలం 134వ వార్డు వెస్ట్ మాంబలం భక్తవత్సలం వీధిలోని క్రీడా మైదానంలో పాటు వలసరవాక్కం మండలం 144వ వార్డు మదురవాయల్ పీహెచ్ రోడ్డులోని భాగ్యలక్ష్మి కల్యాణ మండపం, ఆలందూర్ మండలం 161వ వార్డు పొన్నియమ్మన్ ఆలయ వీధిలోని ఏజీఎస్ మహోన్నత పాఠశాల, అడయార్ మండలం 172వ వార్డు గిండి రేస్ కోర్సులోని సీఎస్ఐ విడిది గృహం మైదానం, పెరుంగుడి మండలం 186వ వార్డు పులివాక్కం మెయిన్ రోడ్డులోని సుమంగళి కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నిర్వహించే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

ఫ్రాన్స్ సంస్థతో ప్రభుత్వ సాంస్కృతిక ఒప్పందం



ఒప్పందపత్రాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక సంస్కృతీ సంప్రదాయాలు, దేవాదాయశాఖ ఫ్రాన్స్ దేశానికి చెందిన వాల్ డి లోయర్ ప్రావిన్స్‌తో సాంస్కృతిక పరమైన అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో ఈ ఒప్పందం కుదిరింది. ఐదేళ్ళపాటు అమలులో ఉండే ఈ ఒప్పంద పత్రాలపై రాష్ట్ర పర్యాటక, సంస్కృతీ శాఖ ప్రభుత్వ అదనపు ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ కె మణివాసన్, వాల్ డి లోయర్ ప్రావిన్స్ సంస్కృతి అంతర్జాతీయ సహకార విభాగం ఉపాధ్యక్షురాలు డెల్ఫైన్ బెన్సి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రానికి చెందిన కళాకారులు ఫ్రాన్స్‌లో పర్యటించి అక్కడి సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోనున్నారు. అదే విధంగా వాల్ డి లోయర్ ప్రావిన్స్‌కు చెందిన కళాకారులు రాష్ట్రానికి వచ్చి, స్థానిక కళాకారులకు సునిశిత శిక్షణ అందించనున్నారు. ఇలా ఐదేళ్లపాటు సాంస్కృతిక మార్పిడులు జరుగుతాయని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఫ్రాన్స్ రాయబారి ఎట్టియెన్ రోలాండ్ పీగ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పర్యాటక శాఖ సంచాలకులు డి.క్రిస్తురాజా, వాల్ డి లోయర్ ప్రావిన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని

కాపాడింది బీజేపీ కాదు

● ఈపీఎస్‌కు దినకరన్ కౌంటర్



పారీస్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని కాపాడింది బీజేపీ కానేకాదని, ఈపీఎస్‌ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టింది పార్టీని కాపాడిన 122 మంది ఎమ్మెల్యేలేనని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ స్పష్టంచేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై 117వ జయంతిని పురస్కరించుకుని సోమవారం రాత్రి నగరంలో ఏఎంఎంకే నిర్వహించిన బహిరంగ సభలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మాట్లాడుతూ జయలలిత మరణించిన తర్వాత అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని కేంద్రంలోని బీజేపీ కాపాడిందని, బీజేపీ పెద్దలకు రుణపడివున్నామన్నారు. ఈపీఎస్ చేసిన వ్యాఖ్యలను దినకరన్ మంగళవారం తంజావూరులో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తప్పుబట్టారు. 2017లో ఈపీఎస్ నేతృత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని కాపాడింది బీజేపీ కాదని, అప్పుడు పార్టీ లో ఉన్న 122 మంది ఎమ్మెల్యేలేనని వివరించారు. ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ఉన్న కూవత్తూరు రిసార్ట్‌లో నిర్వహించిన సమావేశంలో శశికళ సీఎం పదవికి ఈపీఎస్‌ను ఎంపికచేయాలని కోరినందువల్లే ఓపీఎస్‌తో పాటు ఎమ్మెల్యేలంతా ఆయనకు మద్దతుగా సంతకాలు చేశారని, ఈ వాస్తవాలను ఈపీఎస్ మద్దతుదారులు కప్పిపుచ్చే ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేకు బలం ఉన్నప్పటికీ ఆ ఎన్నికల్లో అధికారంలోకి రాలేక ప్రతిపక్షంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకునేందుకు పలుకుబడి ఉన్న పార్టీలు ముందుకు రావడం లేదని, ఇందుకు కారణం మతవాద బీజేపీ కూటమిలో ఈపీఎస్ చేరినందువల్లేనని దినకరన్ ఎద్దేవా చేశారు.

ఎస్ఏ కాలేజీలో సాంస్కృతిక సందడి

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 'ఎస్ఏ కాలేజీ'లో ఇటీవల సాంస్కృతిక సందడి నెలకొంది. 'ఏ రప్సోడి 2025' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంగీతం, సాహిత్యం, ఆటపాటలతో ప్రాంగణం కళకళలాడింది. నగరంలోని 23 కళాశాలల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సృజనాత్మకత ఉట్టిపడింది. కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు విద్యార్థులకు నృత్య, పాటలు, ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా కేపీవై పేమ్ అజార్, ఖురేషి, గాయని నిత్యశ్రీ, డీజే దీపిక, డాన్స్ మాస్టర్ శ్రీధర్, నటి యాషికా ఆనంద్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల కరస్పాండెంట్ పి.వెంకటేష్ రాజా, డైరెక్టర్ డాక్టర్ విసాయి సత్యవతి, ప్రిన్సిపాల్ డాక్టర్ మాలతి సెల్వకుమార్ తదితరులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రముఖులు



స్వాతంత్ర్యసమరయోధుడు రామసామి పదయాచ్చి జయంతి సందర్భంగా చెన్నై గిండిలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీఎంసీ అధినేత జీకే వాసన్, పార్టీ ప్రముఖులు



డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను అన్నా అరివాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్న సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎం.వీరపాండ్యన్ తదితరులు.



స్వాతంత్ర్య సమరయోధుడు రామసామి పదయాచ్చి 108వ జయంతి సందర్భంగా గిండిలోని ఆయన విగ్రహం వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు తదితరులు.

నేపాల్‌లో శాంతి నెలకొంటుంది

● కోవైలో చదువుతున్న ఆ దేశ విద్యార్థుల నమ్మకం



కోవైలో నేపాల్ విద్యార్థులు

పెరంబూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో తిరిగి శాంతి వస్తుందని ఆశిస్తున్నట్టు కోయంబత్తూర్‌లో చదువుతున్న నేపాలీ విద్యార్థులు పేర్కొన్నారు. కోవైలోని ఓ కళాశాలలో చదువుకుంటు న్న నేపాలీ విద్యార్థులు ముస్కాన్ సరఫ్, పంకజ్ బయాలా, దినకర్ తివారి మీడియాతో మాట్లాడుతూ.. అవినీతి, సోషల్ మీడియాపై నిషేధానికి వ్యతిరేకంగా నేపాల్‌లోని యువత 'జెన్ జీ' పేరుతో నిరసనలు చేపట్టిందన్నారు. సంక్షోభం కారణంగా ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలి నేతృత్వంలోని ప్రభుత్వం కుప్పకూలిందని, నిరసనలు హింసాత్మకంగా మారి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అల్లర్లలో తమ కుటుంబాలకు ఎలాంటి హాని జరుగలేదని తెలిసిందని, అక్కడ జరిగిన ఘటన లు తల్లిదండ్రులు మాకు చెబుతుంటే, చాలా భయపడ్డామన్నారు. మొట్టమొదటి సారిగా ఓ మహిళ నేపాల్ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని, త్వరలో నేపాల్‌లో శాంతి నెలకొంటుందని ఆశిస్తున్నామన్నారు.



తిరువిక నగర్ డాన్‌బాస్కో స్కూలు ప్రాంగణంలో మంగళవారం ఉదయం జరిగిన 'ఉంగళుడన్ స్టాలిన్' విజ్ఞప్తుల స్వీకరణ శిబిరంలో లబ్ధిదారులకు సహాయాలు అందజేస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ తదితరులు

హిందూ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం

అడయార్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరామ్‌లోని ధర్మమూర్తి రావు బహదూర్ కల్వల కన్నన్ చెట్టి హిందూ కళాశాలలో 'సెంటర్ ఫర్ క్లైమేట్ రిటరసీ అండ్ క్యాంపెయిన్ (సీసీఎల్‌సీ)' ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీనికి వాతావరణ శాఖ దక్షిణ భారత పూర్వ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బాలచంద్రన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల కార్యదర్శి ఎం.వెంకటేశ పెరుమాళ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరిశోధన, అభివృద్ధి కేంద్రం సంచాలకుడు డాక్టర్ ఎస్.రాజేంద్ర నాయుడు, సీసీఎల్‌సీ విభాగం కన్వీనర్ డాక్టర్ ఆర్.రామ్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముఖ్యంగా కళాశాల ప్రాంగణాల్లో ప్రపంచ ఓజోన్ దినోత్సవ ప్రాముఖ్యతను డాక్టర్ బాలచంద్రన్ వివరించారు. పర్యావరణంలో ఓజోన్ స్థాయి పర్యవేక్షణలో భారత వాతావరణ శాఖ, జాతీయ పర్యావరణ ఇంజనీరింగ్ పరిశోధనా సంస్థ, ఇస్రో, ఐఐటీ వంటి సంస్థల పాత్రను వివరించారు. అనంతరం కాలేజీ విద్యార్థులు, ఆధ్యాపకులతో వరల్డ్ ఓజోన్ డే ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు సర్టిఫికెట్లు, నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టర్ బాలచంద్రన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

టీటీడీ ఈవోకు ధర్మకర్తల మండలి అభినందన



టీటీడీ ఈవోగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్ సింఘాల్‌కు టీటీడీ ధర్మకర్తల మండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. తిరుమలలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్న ఈవో సింఘాల్‌ను బోర్డు స్వాగతించింది. అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది. గతంలో ఈవోగా పనిచేసిన అనిల్‌కుమార్ సింఘాల్‌కున్న అనుభవం భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో, టీటీడీని అభివృద్ధి దిశగా నడిపించడంతో ఉపయోపడుతుందని బోర్డు సభ్యులు అభిప్రాయపడ్డారు. మరోసారి ఈవోగా అవకాశం ఇచ్చిన సీఎంకు సింఘాల్ కృతజ్ఞతలు తెలిపారు. బోర్డు సలహాలు, సహకారంతో భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ఛైర్మన్, బోర్డు సభ్యుడు శాంతారాం ఈవోను సత్కరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడిగా విజయభాస్కరరావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడిగా ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావు నియమితులయ్యారు. ఎస్వీయూలోనే పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసి, 1992 లో ఫిజిక్స్ అధ్యాపకుడిగా చేరారు. ఫిజిక్స్ విభాగాధిపతిగా, ఎస్వీయూ రీసెర్చ్ డీన్‌గా, విక్రమసింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వ్యవహరించారు. ఈయన పర్యవేక్షణలో 30 పీహెచ్‌డీలు, 10 రీసెర్చ్ ప్రాజెక్టులు పూర్తయ్యాయి. సుమారు 200 పరిశోధనా వ్యాసాలు రూపొందించారు. 104వ ఇస్కా కార్యదర్శిగా సేవలందించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.13 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,066

తలనీలాలు సమర్పించినవారు: 24,620

సారీ.. శనేశ్వరా..!



విగ్రహం వద్ద కరుణాకరరెడ్డి

- శని భగవానుడినీ వదలని రాజకీయ గ్రహణం
- అది విష్ణుమూర్తి అంటూ కరుణ దుష్ప్రచారం
- అభయ శనేశ్వరుడని చెప్పినా వినిపించుకోని వైనం

తిరుపతి/తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం శ్రీ వేంకటేశ్వర శిల్పకళాశాల సమీపంలో రెండు దశాబ్దాల కిందటి నుంచి పడున్న ఓ అసంపూర్తి శనేశ్వర విగ్రహానికి వైసీపీ రాజకీయరంగు పులిమింది. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి హఠాత్తుగా మంగళవారం ఆ విగ్రహం వద్దకు చేరుకున్నారు. పాదపీఠికకు మొక్కి కళ్లకద్దుకున్నారు. కొబ్బరికాయ కొట్టి కోనేటిరాయుడా.. ఏమిటీ నీకీ దుస్థితి? హైందవ ధర్మానికి తూట్లు పొడుస్తున్నారని అంటూ ఆవేదనచెందారు. విగ్రహం పడేసిన చోట మూత్ర విసర్జన చేస్తున్నారని, మద్యం తాగుతున్నారని ఆరోపించారు. విష్ణుమూర్తికి జరిగిన అపచారానికి హిందూ సంఘాలన్నీ ఏకంకావాలంటూ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఘోరాలు జరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. దీనిపై సోషల్ మీడియాలో ఫొటోలు పోస్ట్ చేశారు. ఈ విషయం తెలిసి టీడీపీ నాయకులు వాస్తవాలను ప్రజలకు చెప్పాలని ఘటనా స్థలికి వెళ్లారు. అది విష్ణుమూర్తి కాదని, అభయ శనేశ్వర విగ్రహమని రుజువు చేశారు. రెండు దశాబ్దాలుగా అక్కడుందని అన్నారు. అయినా, కరుణాకర్‌రెడ్డి మాత్రం సవరించుకోలేదు. వైఖానస ఆగమశాస్త్రం తెలియని వాళ్లు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అది ముమ్మాటికీ విష్ణుమూర్తి రూపమేనని పునరుద్ఘాటించారు. మరోవైపు, మధ్యాహ్నం తిరుమలలో టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రావడంతో సభ్యులు తీవ్రంగా స్పందించారు. టీటీడీపై తప్పుడు ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని, జైలుకు పంపిస్తామని ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు హెచ్చరించారు.

శనేశ్వరుడినీ వదలవా?: టీడీపీ

రెండు సార్లు ఎమ్మెల్యేగా, టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన వ్యక్తికి ఎప్పటినుంచో పడున్న అసంపూర్తి శనేశ్వర విగ్రహం గురించి తెలియదా అని టీడీపీ నేతలు ప్రశ్నించారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, గంగమ్మ ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, సీనియర్ నాయకులు ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్ తదితరులు ఈ విగ్రహాన్ని పరిశీలించి మీడియాతో మాట్లాడారు. నాస్తికుడైన కరుణాకర్‌రెడ్డి పదే పదే టీటీడీపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కుటుంబసమేతంగా కొండకు వెళ్లి తలనీలాలు ఇచ్చి, స్వామిని వేడుకుంటే తప్ప మీపాపం పోదని మండిపడ్డారు.



విగ్రహాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి చనిపోవడంతో ఆ విగ్రహాన్ని వదిలేశాం



మీడియాతో మాట్లాడుతున్న గురుస్వామి

ఈ ఆరోపణల నేపథ్యంలో విగ్రహాన్ని తయారు చేసిన కన్నయ్యచారి కుమారుడు గురుస్వామి తిరుమల చేరుకున్నారు. టీటీడీ బోర్డుకు వివరాలు వెల్లడించారు. మీడియాతోనూ మాట్లాడారు. 'దాదాపు 22 ఏళ్ల కిందట మాకు రాయలచెరువు రోడ్డులో విగ్రహాల తయారీ షెడ్డు ఉండేది. ఆ సమయంలో బెంగళూరుకు చెందిన వ్యక్తి శనీశ్వరుడు విగ్రహం కావాలని రూ.2 లక్షలు, డ్రాయింగ్ ఇచ్చారు. పది చేతులు, కాకికి బదులుగా సింహం పెట్టాలని కోరాడు. తర్వాత ఆ వ్యక్తి చనిపోయాడు. మా పరిస్థితి కూడా బాగాలేకపోవడంతో అక్కడి స్థలాన్ని విక్రయించి అన్ని విగ్రహాలతో అలిపిరిలోని శిల్ప క్వార్టర్స్‌కు వెళ్లాం. 2003లో అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లైమోర్‌మైన్ పేలుడుతో మమ్మల్ని అక్కడ్నుంచి ఖాళీ చేయించారు. ఆ సమయంలో చిన్నచిన్న విగ్రహాలు తీసుకున్నామే తప్ప, ఈ భారీ శనీశ్వరుడి విగ్రహాన్ని అక్కడే వదిలేశాం. 22 ఏళ్లగా ఈ విగ్రహం అక్కడే ఉంది. చాలాసార్లు తరలించే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు' అని స్పష్టతనిచ్చారు.

శనీశ్వరుడికి, మహావిష్ణువుకు తేడా తేలీదా?

- టీటీడీ సభ్యుల ఆగ్రహం

శనీశ్వరుడికి, మహావిష్ణువు తేడా తెలియదా అంటూ భూమనను టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. 'ఓ రాజకీయ నిరుద్యోగి. పాత చెప్పు ఇవ్వండి ఆ నల్లరాయిని కొడతా అన్న వ్యక్తి. టీటీడీ ఛైర్మన్‌గా, బోర్డు సభ్యుడిగా పనిచేసిన కరుణాకరరెడ్డి అబద్ధాలకు కేరాఫ్ అడ్రెస్‌గా మారారు' అని ఆగ్రహించారు. తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో రెండుసార్లు భూమన టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడూ ఈ విగ్రహం అక్కడే ఉందన్నారు. అప్పుడు పూజలు చేయకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఆయనే ఈ విగ్రహం సమీపంలో మద్యం బాటిళ్లు, పొగాకు ఉత్పత్తుల ప్యాకెట్లు వేయించినట్లు అనుమానాలున్నాయన్నారు. హిందూ వ్యతిరేక ప్రభుత్వంగా చిత్రీకరించేందుకు కరుణాకరరెడ్డి ముందస్తు ప్రణాళికతోనే ఈ ఆరోపణలు చేశారన్నారు. 'నువ్వు ఇంట్లో ఆచరించే మతవిశ్వాసాలు వేరు. ఉనికి కోసం బయట ఆచరించే మతం వేరు. కేవలం ధనార్జన కోసం టీటీడీని, శ్రీవారిని ఉపయోగించుకున్న భక్తిలేని వ్యక్తివి' అంటూ మరో సభ్యుడు ఎంఎస్ రాజు మండిపడ్డారు. కరుణాకరరెడ్డి రోజురోజుకు దిగజారిపోయి మాట్లాడుతున్నారంటూ డాలర్స్ దివాకర్‌రెడ్డి విమర్శించారు. విష్ణుమూర్తికి మీసాలు ఉండవనే విషయాన్ని భూమన గ్రహించాలని పనబాక లక్ష్మి సూచించారు.

భూమనపై కేసు నమోదు

కాగా,టీటీడీపై దుష్ప్రచారం చే స్తూ హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ టీటీడీ డీఈఈ గోవిందరాజులు వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డిపై అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజలను తప్పు దారి పట్టించడం ద్వారా సమాజంలో అల్లకల్లోలం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు భూమనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. కాగా, టీటీడీ ఫిర్యాదు నేపథ్యంలో భూమన మరో వీడియోను విడుదల చేశారు. శనీశ్వరుడి విగ్రహానికి శంకుచక్రాలు ఎందుకుంటాయని ప్రశ్నించారు. ఒకవేళ శనీశ్వరుడి విగ్రహం అనుకున్నా దేవుడే కదా? ఎవరో తెచ్చి పడేస్తే తీసివేయాల్సిన బాధ్యత టీటీడీకి లేదా? అని ప్రశ్నించారు. తనకు జైలు కొత్తకాదని స్పష్టం చేశారు.

రైల్వే బ్రిడ్జి గడ్డర్ల మార్పు పనుల్లో

తీవ్ర జాప్యం

- గంటల తరబడి ఆలస్యంగా నడిచిన రైళ్లు
- అర్థాంతరంగా పలు లోకల్ రైళ్ల రద్దు



గడ్డర్ల మార్పు పనులు చేస్తున్న రైల్వే సిబ్బంది

తడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైల్వే బ్రిడ్జి గడ్డర్ల మార్పు పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడవగా, మరికొన్ని రైళ్లను అర్థాంతరంగా రద్దు చేశారు. చెన్నై - గూడూరు మార్గంలోని తడ - సూళ్లూరుపేట స్టేషన్ల మధ్య కాళంగి నదిపై ఉన్న బ్రిడ్జికి ఇనుప గడ్డర్ల స్థానంలో సిమెంట్ గడ్డర్ల ఏర్పాటు చేయాలని సదరన్ రైల్వే అధికారులు నిర్ణయించారు. సోమవారం అర్ధరాత్రి 1.10నుంచి మంగళవారం ఉదయం 9.10 వరకు పనులు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు పలు రైళ్లను పూర్తిగా, మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు.సోమవారం అర్ధరాత్రి మొదలైన పనులను ఉదయం 9.10కి పూర్తి చేయాల్సి ఉండగా, మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగించారు. దీంతో చెన్నై - విజయవాడ మధ్య నడిచే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి. అలాగే చెన్నై - సూళ్లూరుపేట మధ్య నడిచే లోకల్ రైళ్లు చెన్నై - ఎలాఊరు మధ్య నడిచాయి. చెన్నై సెంట్రల్ నుంచి లక్నో వెళ్లే లక్నో ఎక్స్‌ప్రెస్, విజయవాడ నుంచి చెన్నైకు వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి అహ్మదాబాద్ వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా నడిచాయి. అలాగే చెన్నై సెంట్రల్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రత్యేక రైలు 2.40 నిమిషాలు ఆలస్యం కాగా, సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 10 గంటలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు 2 గంటలు ఆలస్యంగా వెళ్లింది. మరికొన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లు తడ, ఎలాఊరు, గుమ్మిడిపూడి, పోలిరెడ్డిపాళెం, దొరవారిసత్రం, నాయుడుపేట, పెద్దపరియ స్టేషన్లలో గంటల కొద్ది నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



నాయుడుపేటలో ఆగిఉన్న పినాకిని ఎక్స్‌ప్రెస్

అడవిలో మృతులు తమిళనాడువాసులు

- తాజాగా గోతిలో కనిపించిన ఇద్దరు చిన్నారుల శవాలు
- భార్య, పిల్లల మృతదేహాలను గుర్తించిన భర్త
- నలుగురినీ ఎవరో హత్య చేసినట్లు అనుమానం?





కలైసెల్వన్ - జయమాల (ఫైల్‌ఫొటోలు)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చంద్రగిరి/ పాకాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాకాల వారిపల్లె అటవీ ప్రాంతంలో మంగళవారం బయటపడిన మృతదేహాలు తమిళనాడుకు చెందిన వారివిగా నిర్ధారణ అయింది. ఆదివారం సాయంత్రం ఈ అడవిలో ఓ పురుషుడు శవం చెట్టుకు వేలాడుతుండటం, ఓ మహిళ మృతదేహం సమీపాన పడి ఉండటం, అక్కడే పూడ్చిపెట్టిన రెండు గోతులను పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. గోతుల్లో ఇద్దరు చిన్నారులను పూడ్చిపెట్టి ఉంటారని పోలీసులు భావించారు. సోమవారం పురుషుడు, మహిళల శవాల పోస్టుమార్టం, ఖనన ప్రక్రియతో చీకటి పడిపోయింది. ఈక్రమంలో మంగళవారం పోలీసులు అడవికి చేరుకుని రెండు గోతులను కొంతమేర తవ్వారు. గోతిలో మొబైల్ ఫోన్, డెయిరీ మిల్క్ చాక్లెట్, పాన్ కార్డు, ఆధార్ కార్డు, నగదుతో పాటు చిన్నారుల మృతదేహాలున్నట్లు గుర్తించారు. సాయంత్రం కావడంతో గోతులను పూర్తిగా తవ్వలేకపోయారు. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో బుధవారం ఉదయం పూర్తిగా తవ్వి, మృతదేహాలను వెలికి తీయనున్నట్లు పోలీసులు తెలిపారు.

మందుల చీటీనే క్లూ

రెండు రోజుల క్రితం సంఘటనా స్థలం వద్ద మందుల చీటీ పాకాల పోలీసులకు దొరికింది. ఈ క్లూ ఆధారంగా వారు దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రిస్క్రిప్షన్ తమిళనాడులోని తంజావూరు వైద్యుడు రాసిందిగా గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు సదరు వైద్యుడ్ని ఆరా తీశారు. కలైసెల్వన్ అనే వ్యక్తి మానసిక స్థితి సరిగా లేక తన దగ్గర వైద్యం పొందుతున్నాడని ఆ వైద్యుడు తెలిపారు. ఈఏడాది జూలైలో తిట్టచ్చేరి పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని వెంకటేశ్ అనే వ్యక్తి తన భార్య జయమాల, కుమార్తెలు హర్షిణి(7), దర్శిణి(3) కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతడు కుటుంబ పోషణ కోసం కువైట్‌లో ఉండేవాడు. అడవిలో శవాల సమాచారంతో అతడ్ని తమిళనాడు పోలీసులు మంగళవారం తీసుకొచ్చారు. సంఘటనా స్థలంలో ఉన్నది తన భార్య జయమాల మృతదేహమని వెంకటేష్ గుర్తించారు. మరో మృతుడు తన సమీప బంధువు కలైసెల్వన్(37)గా పేర్కొన్నారు. దీంతో మృతులెవరనేది నిర్ధారణ అయింది. మృతులకు నోట్లో గుడ్డలు కుక్కి, పార్సిల్ టేప్ చుట్టినట్లు ఉండటంతో పోలీసులు హత్యగానే భావిస్తున్నారు. లోతైన దర్యాప్తులో వీరి మృతికి సంబంధించి మిస్టరీ వీడుతుందని చెబుతున్నారు.






మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భానుప్రకాష్ - సుబ్రమణ్యం నాయుడు (ఫైల్ ఫొటో)

డీసీఎంఎస్ ఛైర్మన్ కన్నుమూత

- ఎమ్మెల్యేలు, టీడీపీ శ్రేణుల నివాళులు

చంద్రగిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ గడ్డంవారిపల్లెకు చెందిన డీసీఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడు మంగళవారం ఉదయం మృతి చెందారు. కొన్ని రోజులుగా శ్వాసకోశ వ్యాధితో ఇబ్బంది పడుతున్న ఆయన చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అసువులు బాశారు. ఈయన మృతదేహాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని దగ్గరుండి చెన్నై నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం జంక్షన్‌కు మృతదేహం చేరుకుంది. అక్కడ్నుంచి మండలంలోని నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ ద్వారా చంద్రగిరి మీదుగా గడ్డంవారిపల్లెకు మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఈయన గతంలో రెండు పర్యాయాలు మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఐతేపల్లె సింగిల్‌విండో ఛైర్మన్‌గా పనిచేసి, ప్రస్తుతం డీసీఎంఎస్ ఛైర్మన్‌గా ఉన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కార్యకర్తలకు అండగా ఉన్నారు. పార్టీ విజయానికి కృషి చేశారు. ఈయన మృతి పార్టీకి తీరనిలోటని నేతలు పేర్కొన్నారు. చంద్రగిరి, నగరి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భానుప్రకాష్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు, నేతలు కుమారరాజారెడ్డి, ముడిపల్లె సురేష్‌రెడ్డి, పారిశ్రామికవేత్త ఏవీ రమణమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, శుభగిరి, శ్రీధర్‌నాయుడు, అనిమిని మధు, దేవానందనాయుడు తదితరుల నివాళులర్పించారు.

జలజల జాలువారంగ..!





తిరుపతిలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో శేషాచల కొండల్లో నుంచి మాల్వాడిగుండం ప్రవహించింది. కపిలతీర్థంలోకి జలజలమంటూ జలపాతం దూకుతూ కనువిందు చేసింది.

మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్స్

- ఈసారి లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌కు..
- ఫేక్ మెయిల్‌గా తేల్చిన బీడీ టీమ్



లిటిల్ ఏంజెల్స్ స్కూలులో తనిఖీలు చేస్తున్న పోలీసులు, బాంబు స్క్వాడ్ సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మీ హోటళ్లలో బాంబులు పెట్టాం.. పేల్చేస్తామంటూ గతేడాది అక్టోబరు 24న మొదలైన బెదిరింపు ఈ మెయిల్స్ ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తాజాగా తిరుపతి నగరం రైల్వే కాలనీలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌కు ఆ తరహా మెయిల్ వచ్చింది. ఈ స్కూల్‌లో బాంబులు పెట్టామని త్వరలో పేలతాయంటూ మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తమిళనాడు నుంచి రజాక్ హాట్ మెయిల్ నుంచి స్కూల్ మెయిల్‌కి సందేశం పంపారు. దీనిపై పాఠశాల కరస్పాండెంట్ అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ అజిత, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలికి వెళ్లి బాంబు డిస్పోజల్ పరికరాలతో పాఠశాలతో పాటు ప్రిన్సిపాల్ చాంబర్, తరగతి గదులు, ప్రాంగణమంతా తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్ సిబ్బందీ పరిశీలించారు. దాదాపు గంట పాటు జరిగిన తనిఖీల్లో ఎలాంటి బాంబులు లేవని, ఫేక్ మెయిల్‌గా తేల్చారు. దీనిపై అలిపిరి సీఐ కేసు నమోదు చేశారు.కాగా, 11నెలల కిందట తొలుత నాలుగు హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఆ తర్వాత అక్టోబరు 27న ఇస్కాన్ టెంపుల్‌కు, మరో ఐదు హోటళ్లకూ.. డిసెంబరు 13న వ్యవసాయ కళాశాలకు.. ఈ ఏడాది మార్చి 21న కలెక్టరేట్‌కు.. మే 28న మళ్లీ కలెక్టరేట్‌కు.. వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. కొంతకాలం ఆగాక.. మళ్లీ బాంబు మెయిల్ వచ్చింది.

శ్రీవారి ఆలయ శుద్ధి

తిరుమల, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధి జరిగింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందు వచ్చే మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆనంద నిలయం నుంచి బంగారు వాకిలి, ఉప ఆలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పుతో పాటు పూజా సామగ్రిని శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజాసామగ్రి తీసుకొస్తున్న టీటీడీ ఛైర్మన్, ఈవో తదితరులు

డిజిటల్ మారథాన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్ర యువ సంకల్ప్ 2కె25 రాయబారి డిజిటల్ మారథాన్'కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ తెలిపారు. వికసిత్ భారత్‌లో భాగంగా సామాజిక బాధ్యత, కుటుంబ సంబంధాలు, ఆరోగ్యకరమైన జీవనం, బాధ్యతాయుత డిజిటల్ ఆవిష్కరణల ప్రోత్సాహానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. 18-35 ఏళ్ల మధ్య వయస్కులు తాము చేపట్టిన కార్యక్రమాలపై 120సెకన్ల నిడివి గల వీడియోలను సొంత సామాజిక మాధ్యమాల్లో చూపించి అధికారిక హాష్‌టాగ్‌లతో పోస్టు చేయాలన్నారు. ఉత్తమమైన మూడింటిని ఎంపికచేసి రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేల బహుమతి ఇస్తారన్నారు. 9మంది విజేతలకు ఆంధ్ర యువత బ్రాండ్ అంబాసిడర్ గా సత్కరిస్తారు. ఆసక్తి గల వారు 'ఆంధ్రయువసంకల్ప్.కామ్' వెబ్‌సైట్‌లో పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9848543976 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.